క్లుప్తంగా

జిల్లా సరిహద్దులో తనిఖీలు ముమ్మరం



పిట్టలవానిపాలెం: బాపట్ల–గుంటూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన సంగుపాలెం–కోడూరు గ్రామ శివారులో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. గురువారం చందోలు ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఉదయం నుంచి ప్రతి వాహనాన్ని ఆపి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలలో డబ్బు, మద్యం అక్రమంగా రవాణా జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ రహదారి వెంట రాకపోకలు సాగించే వాహనాలను ఆపి తనిఖీలు చేయడంతో పాటు వివరాలు సేకరించి విడిచిపెడుతున్నారు. అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

మహిళలు ఆర్థిక స్థితిమంతులు కావాలి



బాపట్ల: గ్రామీణ మహిళలకు కుటుంబ ఆర్థిక సుస్థిరత, నైపుణ్యాలతో కూడిన ఉపాధి కల్పన ఎంతో అవసరమని ఎస్ టూ నీడ్ ఫౌండేషన్ డైరెక్టర్ రమ్య పావని తోట పేర్కొన్నారు. ఎస్ టూ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయలక్ష్మీపురంలో మహిళలకు శిక్షణ ఇవ్వటంతో పాటు కుట్టు మిషన్లు గురువారం పంపిణీ చేశారు. మహిళలకు ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వటంతో వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని తెలిపారు. తద్వారా వారు ఆర్థిక స్థితిమంతులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కుట్టుమిషన్‌లో 25 సంవత్సరాలు అనుభవం కలిగిన కుండేటి శివకుమారి, స్వప్న ఇచ్చిన శిక్షణ మహిళలకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి మరియమ్మ, ఐనవోలు సత్యవతి తదితరులకు మిషన్లు పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు సేవలు చిరస్మరణీయం



పొన్నూరు: నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ శాసనసభ్యులు చిట్టినేని వెంకట్రావు చిరస్మరణీయులని పొన్నూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కొనియాడారు. గురువారం నిడుబ్రోలులోని వెంకట్రావు స్మృతి వనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు–నిడుబ్రోలు పట్టణాల దాహార్తిని తీర్చటానికి వంద ఎకరాల చెరువును అభివృద్ధి చేసి తాగునీటి సమస్యను తీర్చిన గొప్ప వ్యక్తి చిట్టినేని వెంకట్రావు అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం



కొమ్మూరు(కాకుమాను): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ బలగాలు పనిచేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర అన్నారు. మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాలలో గురువారం సాయంత్రం పోలీస్ బలగాలతో ఎస్ఐ రవీంద్ర కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా గ్రామాలలోని అన్ని పార్టీల నాయకులు, ఓటర్లు పోలీస్‌లకు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా వసంతోత్సవ చక్రస్నానం

కొల్లిపర: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్థన స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యహోమం, బలిహరణ పూజలు నిర్వహించి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేదల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- పార్టీ శ్రేణులతో కలసి భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారం



భట్టిప్రోలులో మహిళా వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ద్వారానే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి భట్టిప్రోలులో పర్యటించిన ఆయన 'ప్రజా ఆశీర్వాదం' పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ అధికారం కోసం ప్రతిపక్షాలు తమ పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయన్నారు. వారి మాటలను నమ్మవద్దని వాస్తవాలను గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి పనులను చూసి రాబోయే ఎన్నికల్లో మరొకసారి వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించినట్లయితే నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. పర్యటనలో భాగంగా వృద్ధులు, చిన్నారులు, చిరు వ్యాపారులను పలకరించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, బండారు శ్రీనివాసరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, వార్డు సభ్యులు కుక్కల వెంకట్రామయ్య, కుక్కల భూషణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పూరి చిన్నారి, దారా చెన్నయ్య, కుందేటి రమేష్, పసుపులేటి శివరామప్రసాద్, కొలుసు శివన్నారాయణ, సయ్యద్ సిరాజుద్దీన్, మద్దుల గిరిధర్, అబ్దుల్లాబేగ్, తబ్రేజ్, షర్ఫుద్దీన్, పప్పుల విజయరాజు, చిరంజీవి, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వరికూటితో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- వైఎస్సార్ సీపీలో చేరిన కర్లపాలెం యువకులు

బాపట్ల: వైఎస్సార్ సీపీ విజయానికి అంతా కలిసికట్టుగా కృషి చేద్దామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలో 20 మంది యువకులు ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. నియోజకవర్గంలో కోన రఘుపతికి మద్దతు పెరుగుతోందని కర్లపాలెం మండల కన్వీనర్ ఏడుకొండలు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు బాగుపడాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని కోన సూచించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు భరత్‌రెడ్డి, తాజ్ తదితరులు పాల్గొన్నారు.



కోన రఘుపతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కర్లపాలెం యువకులు

ఎన్నికల నియమావళిని విధిగా అనుసరించాలి

- ఆర్డీవో హెలా షారోన్
- రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల నియమావళిని ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు విధిగా అనుసరించాలని ఆర్డీవో హెలా షారోన్ సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహణకు ఆయా పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులపై రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు ఉంచరాదన్నారు. ప్రైవేటు ఆస్తులపై రాజకీయ పార్టీల బ్యానర్‌లు, జెండాలు ఏర్పాటు చేసిన యెడల యజమాని నుంచి అభ్యంతరం లేనట్లుగా రాత పూర్వకమైన లేఖను తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసే తాత్కాలిక రాజకీయ పార్టీ కార్యాలయాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎటువంటి తాత్కాలిక రాజకీయపార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయరాదన్నారు. ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలతో ర్యాలీలు నిర్వహించుకునే వారు తమ వాహనాలపై చిన్నపాటి జెండాను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ర్యాలీల సమయంలో పెద్ద పెద్ద జెండాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాలీలు నిర్వహించే సమయం, రూట్‌లను తప్పనిసరిగా కార్యాలయంలో తెలియజేయాలన్నారు. అభ్యర్థి నిర్వహించే ప్రతి ఖర్చుపై తమ ఎన్నికల అధికారుల నిఘా ఉంటుందని చెప్పారు. ఎలెక్షన్ కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు ఆయా రాజకీయ పార్టీల నాయకులు అనుసరించాల్సిన నిబంధనలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి వివరించారు. సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న బ్రహ్మోత్సవాలు



శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయం



విద్యుత్ కాంతుల వెలుగులో పెదపులివర్రులోని శ్రీ వరద రాజస్వామి ఆలయం



శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం

- ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు
- నేడు పొన్నమాను ఉత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం బింది తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణ, రాత్రి పుష్పసేవ కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర భక్త సమాజం ఆర్గనైజర్ కొలుసు నాగమ్మ బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. శుక్రవారం రాత్రికి పొన్నమాను ఉత్సవం కనుల పండువగా జరగనుంది. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవం ఆదివారం సాయంత్రం జరుగుతుంది. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, ఫౌండర్ ట్రస్టీలు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు పర్యవేక్షించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన భూమిక అయినటువంటి స్వామి వారి దివ్య రథోత్సవానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు కోరారు. రెవెన్యూ, పంచాయతీ, అగ్ని మాపకదళం, పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, వివిధ శాఖల సహాయ సహకారాలతో రథోత్సవానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పెదపులివర్రులో..

భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరద రాజస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణ జరిగింది. నిత్యహోమం, బలిహరణ, భేరి పూజ, యారోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు శాస్త్ర యుక్తంగా జరిపారు. శుక్రవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం అనంతరం గరుడోత్సవం నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు తెలిపారు.

చినపరిమిలో రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చిన పరిమి గ్రామంలో కొలువైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి నవాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం, సాయంత్రం నిత్యహోమం, బలిహరణ, రాత్రి బృంగి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవం ఈ నెల 24న జరుగుతుందని దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఈమని అశోకరెడ్డి తెలిపారు. కల్యాణ మహోత్సవాలు ఈ నెల 25 వరకు జరుగుతాయని పేర్కొన్నారు.



బృంగి వాహనంపై స్వామి వార్లు

పోస్టల్ సేవలపై అవగాహన పెంచాలి

రేపల్లె పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకరబాబు



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకరబాబు

రేపల్లెరూరల్: తపాలాశాఖ అందిస్తున్న సేవలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి సేవలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రేపల్లె పోస్టల్ సూపరింటెండెంట్ జీ.కరుణాకరబాబు అన్నారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు కార్యాలయ ఆవరణలో పోస్టల్ సేవలపై హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని పోస్టల్ కార్యాలయాల సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్ల మంది ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్న అతి పెద్ద శాఖ తపాలాశాఖ అన్నారు. ఇటువంటి శాఖ నుంచి ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామని, ఆయా సేవలపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా పోస్టల్ సిబ్బంది పని చేయాలని కోరారు. పోస్టల్‌లో అందించే బ్యాంకింగ్ సేవలు, సమాచార చేరవేత సేవలు వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కరుణాకరబాబుకు పోస్టల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె సబ్‌డివిజన్ అధికారి కే.ఏడుకొండలు, అధికారులు పి.నరేంద్ర, బి.కిరణ్, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలులో వివక్ష



ప్రధాన రహదారి వెంబడి అనుమతులు లేకుండా ఏర్పాటైన టీడీపీ కార్యాలయం



కేటీ కాలనీలో టీడీపీ మాజీ ప్రజా ప్రతినిధుల పేర్లతో కూడిన శిలాఫలకం

- పోలింగ్ కేంద్రానికి కూతవేటు దూరంలో టీడీపీ కార్యాలయం
- అధికారుల పర్యవేక్షణ లోపంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

కొల్లూరు : ఎన్నికల నియమావళి అమలులో అధికారుల వివక్ష కొట్టొచ్చినట్లు కానవస్తుంది. అధికార వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలు, శిలాఫలకాలు కనిపించకుండా చేయడంపై అమితాసక్తి చూపుతున్న అధికారులు ప్రతిపక్ష టీడీపీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధుల శిలా ఫలకాలు బహిర్గతం కాకుండా చూసే విషయంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడంపై వైఎస్సార్ సీపీశ్ శ్రేణుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరులో స్థానిక బాలికోన్నత, బాలురోన్నత పాఠశాలల్లో ఉన్న 143, 144, 148, 149 పోలింగ్ బూత్‌లకు కూతవేటు దూరంలో ప్రధాన రహదారి వెంబడి టీడీపీ పార్టీ కార్యాలయం వెలుపల అనుమతులు లేకుండా దర్శనమిస్తున్న ఆ పార్టీ నాయకుల చిత్రపటాలు, జెండా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇదే మార్గం నుంచి ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళ్లాల్సి ఉన్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల స్థాయి అధికారులు ఎన్నికల నియమావళి అమలు విషయంలో గ్రామాల్లో జల్లెడ పడుతున్నా టీడీపీ కార్యాలయం విషయంలో పట్టీ పట్టనట్లు వ్యవహరించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొల్లూరు శివారు కేటీ కాలనీలో సైతం ఓ ఆలయం వెలుపల టీడీపీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధుల పేర్లతో కూడిన శిలాఫలకం రహదారి వెంబడి ఉన్నప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంపై వైఎస్సార్ సీపీ శ్రేణుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు మంజూరు కాలేదు

కొల్లూరులో టీడీపీ కార్యాలయం నిర్వహణకు ఆ పార్టీకి చెందిన వ్యక్తి అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని వేమూరు ఎన్నికల డీటీ శ్రీనివాసులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు మంజూరు కాలేదన్నారు. ప్రధాన రహదారుల వెంబడి పార్టీ కార్యాలయాల నిర్వహణ విషయంలో అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. శిలాఫలకాలపై రాజకీయ నాయకుల చిత్ర పటాలు, పేర్లు కనిపించకుండా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయండి

తెనాలిరూరల్: దుగ్గిరాలలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించిన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లోని పసుపు బస్తాలను యజమాని అక్రమంగా తరలించే సన్నాహాలు చేస్తున్నాడని దీనిని అధికారులు అడ్డుకోవాలని కోరుతూ రైతు సంఘ నాయకులు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి గురువారం సాయంత్రం వెళ్లిన నాయకులు ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. అగ్ని ప్రమాదం జరిగి 62 రోజులైనా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం అందలేదని వివరించారు. కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న పసుపు బస్తాల్లో వెయ్యి బస్తాలను యజమాని అక్రమంగా తరలించి అమ్ముకునే యత్నాలు చేస్తున్నాడని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ దుగ్గిరాల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీజ్ చేసి ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లో సరుకును తరలించడమే మిటని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి, నాదెళ్ల సురేంద్ర, వెనిగళ్ల శివయ్య, పోతురాజు, కోటేశ్వరరావు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ– ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్‌తో అవగాహన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను గుర్తించి వారిలో ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ అవకాశాలను అందిస్తారని పేర్కొన్నారు. ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. అగ్రశ్రేణి ప్రతిభను రిక్రూట్ చేయడానికి ఈ అవగాహన ఒప్పందం ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే విధంగా ట్రైనింగ్ ఇవ్వడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



అవగాహన పత్రాలను మార్చుకుంటున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్, మోహిత్ సింగ్

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మార్కెట్ సెంటరులో ఉన్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. అతని వద్ద తొమ్మిది క్వార్టర్లు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరి

తెనాలిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ప్రచారాలు, ర్యాలీలు, బహిరంగ సభలకు వినియోగించే వాహనాలకు అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లేదా ఎలక్షన్ కమిషన్ 'సువిధ' యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనుమతులు లేని వాహనాలను ర్యాలీలు, ప్రచారాలు, ఇంటింటి ప్రచారాలకు వినియోగిస్తే ఎలక్షన్ కమిషన్ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు సంబంధించి 08644-232475 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

24న క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌జీవో ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభు కొండపాటూరు పోలేరమ్మ తల్లి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి బత్తుల సురేష్ బాబు తెలిపారు. గత మూడు నెలల అమ్మవారి హుండీ ఆదాయం రూ.5,08,450 (ఐదు లక్షల ఎనిమిది వేల నాలుగు వందల యాభై)లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కంతమనేని నరేష్ బాబు, గ్రామ పెద్దలు రామినేని తిరుపతిరావు, మండవ శ్రీనివాసరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పొలినేని రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విమోచన పండుగల నిర్వహణకు విరాళం

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో గ్రేస్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన విమోచన పండుగల నిర్వహణకు రూ.5 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాబు గురువారం తెలిపారు. తెనాలి రూరల్ మండల పాస్టర్ అండ్ గాస్పల్ వర్కర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రాద్ ఆధ్వర్యంలో నగదు విరాళం అందజేసినట్లు చెప్పారు. రూరల్ గ్రామాల్లో దేవుని సేవ చేస్తున్న పాస్టర్లు, దైవజనులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.